# అయిన వాళ్ళం మహా ప్రభో!

సాయంత్రం నాలుగున్నర దాటింది. మా యూనిట్‌లో కూచుని టి.వి.లో ఋతురాగాలు చూస్తూ అనుకుంటున్నాను. ఇంత చక్కని సమకాలీన నవల రాసిన రచయిత్రి ఈ పేరెందుకు పెట్టిందబ్బా? సవ్యంగా

ఆలోచించినా, మానసిక రోగులకి వెంటనే తోచే అపసవ్యపు అర్థం తీసినా కూడా అటువంటి రాగాలేవీ ఈ సీరియల్‌లో పాత్రలు తీయటం లేదే?

లక్ష్మి ఏదో మహాకష్టపడి పోతున్నట్లు మొహం పెట్టుకుని నా గదిలోకి వచ్చింది. "సూడమ్మా,ఈ రాజు! ఇప్పటికిప్పుడు ఐదు కాఫీలు కావాలంటాడు. అందరి చాయిలయినాక ఏడ నుండమ్మా ఇన్ని కాఫీలు కలిపేదీ" అనుకుంటూ.

"ఇలాటి విషయాలకి నా దాకా రావద్దని చెప్పానా? మస్తాన్ దగ్గర ఆరు చాయ్‌లు తెప్పించి వేడిచేసి మన కప్పుల్లో పోసి పైకి తీసికెళ్ళు". అసలింతకీ ఎవరొచ్చారు చెప్మా - "రాజూ ఎవరొచ్చారూ?"

"ఐదారుగురు వచ్చారమ్మా. ఎవరో చంద్రబాబుగారంట. మిమ్మల్ని పిలవమంటున్నారు".

"ఎవరో అంటారేమిటయ్యా! మన సి.ఎం.గారేమో ?"

"కాదమ్మా! మన సి.ఎం.గారిలా లేరమ్మా. ఈయనెవరో మంచి సూట్లో దర్జాగా ఉన్నారమ్మా".

"గడ్డమూ, చేతిలో కంప్యూటరూ ఉన్నాయా ?'

"ఆ చేతిలో ఏదో ఉందమ్మా! గడ్డమయితే అలానే ఉందమ్మా".

"చంపావయ్యా బాబూ! సాక్షాత్తు మన సి.ఎం.గారే. కొత్తగా అమెరికా వెళ్ళొచ్చారు కాబట్టి కొన్నాళ్ళా నిగారింపు ఉంటుంది. నీ తెలివి సంతకెళ్ళా! అంత పెద్ద వాళ్ళొస్తే నాతో తిన్నగా చెప్పకుండా లక్ష్మితో కాఫీ కోసం జగడం ఆడుతున్నావా?"

"అంటే, ఋతురాగాలొస్తుంటే డిస్టర్బ్ చేయొద్దన్నారు కదా అని వెంటనే చెప్పలేదమ్మా. అమ్మా, మన బ్యాంకు ఓ.డి. సంగతి వీరికి చెబితే ఔతుందేమోనమ్మా"

"నీ తలకాయ! బ్యాంకులు ఈయన కింద ఉండవు. వాళ్ళు ఈయన మాట వినాల్సిన పనిలేదు. నీ దిక్కు మాలిన సలహాలు పక్కనపెట్టి మన సార్‌ని కూడా పైకి రమ్మని చెప్పు. ఇదిగో నేను ఆయనతో మాట్లాడుతుంటే నువ్వు దెయ్యంలా గుమ్మానికి వేళ్ళాడకు".

ఉరుకులు పరుగులు పెట్టుకుంటూ పైకి వెళ్ళాను. తీరా చూద్దును కదా. నా భయం నిజమే! సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడే ఇన్స్పెక్షన్‌కొచ్చేశాడు. నాయుడుగారు ఏమాత్రం సమయం వృథా కానీయకుండా ఎవరెవరికో ఆదేశాలిస్తున్నారు. వెనకాల నలుగురు ఆఫీసర్లలాటి వారు కూచోవాలో, నించోవాలో తెలీక వంగుని ఉన్నారు.

"నమస్కారం సార్! మీలాటి పెద్దలు మా యూనిట్‌కి రావడం మేం చేసుకున్న అదృష్టం. కబురుపెడితే మేమే వచ్చేవాళ్ళం కదా సార్!"

"ఏం వచ్చేవాళ్ళండి. చూస్తూనే ఉంటాగా! మిమ్మల్నందరినీ. పట్టుచీరలు కట్టుకుని పేరంటానికొచ్చినట్టు వచ్చి వెడతారు. వాస్తవాలు మాకు ఎలా తెలుస్తాయి?"

"అదా! ఎంత చిన్న పరిశ్రమలు నడుపుతుంటే మాత్రం, పాత చీరలు కట్టుకుని తిరిగితే అప్పు పుట్టొద్దుటండీ! మీరు ఏయే సెమినార్లు, వర్క్‌షాప్‌లు ప్రారంభోత్సవాలు చేస్తుంటే మేం అక్కడక్కడికి వచ్చి ఫంక్షనవగానే వెళ్ళిపోతాం. పూర్తిగా వర్క్‌షాపయ్యే వరకూ ఉంటే మమ్మల్ని బొత్తిగా పనిలేని వాళ్ళను కుంటారని. అయినా సార్, మీరెందుకండి! ప్రారంభోత్సవాలకొచ్చి టైం వేస్ట్ చేసుకుంటారు. కనీసం ముగింపు ఉత్సవానికొస్తే ఆ సెమినార్ కొచ్చిన పెద్దల అభిప్రాయాలైనా తెలుస్తాయి గదా!"

"ఈ పాయింట్ నోట్ చేసుకుంటాలెండి. మేం ఇక్కడేదో డ్రైనేజీ పొంగి పొర్లి ఇళ్ళు మునిగి పోతు న్నాయని విని వెడుతూంటే దారిలో - ఇది చదువుకున్నవాళ్ళు పాతికేళ్ళక్రితం పెట్టిన పారిశ్రామిక వాడ అని చెప్పారు. ఎలా నడుస్తూందో కనుక్కుందామని వస్తే ఇది మీ యూనిట్టని తెలిసింది. మీవాడితో ప్రొప్రయిటర్ గారిని పిలవమంటే మీరు టీవీ చూస్తున్నారని చెప్పాడు. ఇంత చదువుకున్న మీరే ఇలా చేస్తే ఇక రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర పౌరులుగా మీకేమీ బాధ్యతలు లేవా?"

గుడ్లురుముతూ మావాడికేసి చూశా. వాడు లెంపలేసుకుంటూ ఎటో చూస్తున్నాడు."ఇది మరీ బాగుం ది సార్! ఏం తయారుచేయమంటారు! చేసి ఎవరికమ్మమంటారు! ఐనా మేం సరిగ్గా పని చేస్తున్నామో లేదో కనుక్కోడానికి మేమేమీ ఒకటో తారీఖున జీతం అందుకోగల భాగ్యశాలులం కాదు కదా! ఉద్యోగులకంటే ఆఫీసు కొస్తే జీతాలో, నాతాలో వస్తాయి. మాబోటివాళ్ళం ఏదో ఒకటి చెయ్యాలి కదా అని పని చేస్తే ఉన్నది కాస్తా పోయినా పోవచ్చు. సర్వమంగళం పాడొచ్చు!"

"పనిచేస్తే ఎలా పోతుందండీ. కొత్త థీరీలు చెప్పకండి!"

"కాదండీ, మరి మేం పనిచేయాలంటే పెట్టుబడి పెట్టాలా! అంటే మళ్ళీ అప్పు చేయాలా!అంటే, ఉన్నదంతా తాకట్టు పెట్టాలా! పోనీమని తప్పుదారి కాస్త ఏమన్నా కలిసొస్తే, అలాంటివే ఓ పది యూనిట్లు వస్తే, మాలో మేం తన్నుకుచచ్చి, మా పదిమంది ఇళ్ళు వేలమయ్యాక పది గుడిసెలేసుకుని బతకాలా! ఎందుకింత గొడవని మేం ఇప్పుడే కాస్త జాగ్రత్తపడి టీవీ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాం. అయినా అందరి చూపు అమెరికా పెళ్ళికొడుకుల మీద ఉంటే మేనరికాలెవరికి కావాలండీ ?"

"ఆ వికటపు వితండవాదం మానేయండి. శ్రద్ధగా పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదు. బిల్‌గేట్స్‌ని ఆదర్శంగా తీసుకోండి!"

"అః! మమ్మల్నంటున్నారుగానీ, మీరు మాత్రం మమ్మల్ని చూస్తున్నారా? - 'అయినవాళ్ళకి ఆకుల్లో '

అనే పద్ధతి మీరు ఖచ్చితంగా పాటించట్లేదూ? మీ అమెరికా టూర్‌లో ఒంటరిగా న్యూయార్క్‌లో తిరుగుతూంటే మా ప్రాణాలెంత కొట్టుకుపోయాయో, ఆ మాత్రం సాయం మాకు చేస్తే నాలుగు రాళ్ళు(ఇపుడు మేం సంపాదిస్తున్న లాటివి కాదు) సంపాదించుకోమా?"

"అలాగైతే అంజిరెడ్డిని చూడండి, రమేష్‌ని చూడండి. వీళ్ళంతా మీలా మొదలుపెట్టి జీవితంలో బ్రహ్మాండంగా పైకి రాలేదా?"

"సరే. నే వాళ్ళని చూస్తా. నేను కొందరి పేర్లు చెప్తా మరి. వినండి. చక్కగా నడుస్తున్న యూనిట్‌ని అలా ఉండనీక ఊళ్ళోవాళ్ళంతా పైకిరా, ఇంకా పైకిరా, అంటే పైకి రావాలి గామోసని ఎక్స్‌పాన్షన్ కెళ్ళి ఎలక్ట్రిసిటీ బోర్డ్ వాళ్ళు స్తంభాలు పాతడానికే రెండేళ్ళు పట్టిస్తే మొత్తం సిక్ ఐపోయిన రాజిరెడ్డిని చూడండి. లిబరలైజేషన్ పుణ్యమా అని మొత్తం కాంపొనెంట్స్ చవగ్గా వస్తున్నాయని వాళ్ళ ప్రిన్సిపల్స్ అన్నీ బైటనించి కొనుక్కోవడం మొదలుపెట్టేసరికి ఏం చేయాలో తోచక, ఈ దెబ్బెలా తట్టుకోవాలో తెలియక నానా బాధలుపడి, చివరికి యాభైఏళ్లకే పండు ముసలైపోయిన రామస్వామిగారిని చూడండి. సింగపూర్‌లో బ్యాంక్ అప్పిస్తానందని ఉద్యోగం మానేసి అంతా తన సొంత పెట్టుబడి పెట్టాక, కొల్లేటరల్ చాల్లేదని ఆ బ్యాంక్‌వాళ్ళు తప్పుకుంటే కుప్పకూలిపోయి ప్రాణాలొదిలేసిన ఆంజనేయులుగారిని చూడండి. నాలుగు వాయిదాలు బాకీపడిందని ఇరవైమంది పనిచేస్తూన్న యూనిట్లోంచి అందర్నీ బయటికి తరిమేసి కార్పొరేషన్ వాళ్ళు తాళాలేస్తే మూడేళ్ళనించీ ఇంట్లో కూర్చుని గోళ్ళుగిల్లుకుంటున్న రత్నమాలగారిని చూడండి. నన్నడిగితే ఇలాటి అమరజవాన్లని ఎంతమందిని చూపించగలనో?"

"సరే, మీరంటే చేతకాకో, మరో కారణమో - అస్త్ర సన్యాసం చేసి టీవీ చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. నేను నానాయాతనలు పడి అన్ని దేశాలూ తిరిగి అందర్నీ మన రాష్ట్రానికొచ్చి పరిశ్రమలు పెట్టండని బతిమాల్తుంటే, మీరు మొన్న ఎవరో అడిగితే ఆలోచించుకోమని సలహా ఇస్తారా! ఇదేనా మీ రాష్ట్ర భక్తి ?"

ఇదెక్కడి కొత్త భక్తిరా దేవుడా? ఉన్న దేవుళ్ళుచాలరన్నట్టు. "నేనెక్కడ రావద్దన్నానండీ చూసుకుని రమ్మన్నా. తెలుసుకుని రమ్మన్నా".

"అజ్ఞానం ఇచ్చే ధైర్యం విజ్ఞానం ఇవ్వదని మీకు తెలియదా? అన్నీ తెలిస్తే ఎవడైనా ఇండస్ట్రీ జోలికి వెడతాడా? పెళ్ళయ్యాక పడే పాట్లు తెలిస్తే ఎవడైనా పెళ్ళి చేసుకుంటాడా? ఐనా సమాజంలో అందరూ అంతో ఇంతో హాయిగా బతకట్లా, పెళ్ళయ్యాక కూడా!! అలాగే ఇదీనూ. ఒక సారి నీళ్ళలోకి దూకేస్తే ఈత అదే వస్తుంది".

"అంటే, మీ లక్ష్యం-గట్టు దాకా తీసుకొచ్చి తోసెయ్యడమన్నమాట!! శుభం. ఐతే తోలుకురండి, చేతనైనంత మందిని".

"మావంతు కృషి మేం చేస్తున్నాం.రాష్ట్రం అన్ని విధాలుగా బాగుపడి పెట్టుబడులు రావాలనేగా, ఎక్కడెక్కడ నించో అప్పులు తెచ్చి రోడ్లేయిస్తున్నాం!"

"రోడ్లేస్తే , ఇండస్ట్రీలొస్తాయా?"

"మరి పరిశ్రమల కోసం కొన్ని వందల ఎకరాలు కేటాయిస్తున్నాం".

"స్థలం ఉంటే, ఇండస్ట్రీలొస్తాయా?"

"కావలసినంత పవరిస్తామంటున్నాం".

"పవరుంటే, ఇండస్ట్రీలొస్తాయా?"

"మరి బోలెడు రాయితీలిస్తున్నాం!"

"ఏం రాయితీలు? అయినా రాయితీలున్నాయని ఇండస్ట్రీ పెట్టి బాగుపడినవాడిని ఇప్పటివరకూ చూడ లేదు!"

"ఎంతోమంది నిరుద్యోగ యువత ఉన్న రాష్ట్రం మనది".

"నిరుద్యోగ యువత ఉంటే, ఇండస్ట్రీలొస్తాయా? ఇంతమంది డిగ్రీలు పుచ్చుకుని కాలక్షేపం చేస్తున్న కుర్రాళ్ళలో, నేనీ పని సవ్యంగా చేయగలను అని చెప్పగల లక్షణమైన పిల్లలని చూపించండి. చేతగాని వాడు చదరంగం ఆడితే, వాడి బలగాలే వాడి కాళ్ళకి అడ్డం పడ్డట్లు, ఏ పనీ సరిగా చేయలేని యువతరాన్ని తయారుచేస్తున్నందుకు మనం సిగ్గు పడాలి!"

"రోడ్లేస్తే ఇండస్ట్రీలు రావు. లాండుంటే రావు. పవరిస్తే రావు, మరేం చేస్తే వస్తాయి. ఏ ప్రభుత్వమైనా ఇంతకంటే ఏం చెస్తుంది - మీరే చెప్పండి!"

"మా పని మమ్మల్ని చేసుకోనిస్తే వస్తాయి. ఐనదానికీ కానిదానికీ జైల్లో పెడతామని బెదిరించకుండా వుంటే వస్తాయి. మా పేమెంట్స్ మాకు టైంకు వచ్చేలా చూస్తే వస్తాయి. నిజంగా మార్కెట్లో డిమాండున్న వస్తువులను గుర్తించి చేతనైన వాళ్ళని క్షుణ్ణంగా పరీక్షించి వాళ్ళకిచ్చి వాళ్ళ కష్ట సమయాల్లో కూడా తోడుంటే వస్తాయి. మాలో మాకే పోటీ పెట్టి మమ్మల్నందరినీ మూకుమ్మడిగా దివాళా తీయించకుంటే వస్తాయి!"

"ఇన్ని విధాలుగా తోడుండటం ఏప్రభుత్వానికైనా సాధ్యమేనా? పేద్ద పరిశ్రమాధిపతులు కదా మీరే చెప్పండి!"

"అన్నిటికీ సరైన తెలుగు పదాలు లేక మమ్మల్నిలా వెక్కిరిస్తున్నారు గానీ, మేం దేనికధిపతులమండీ బాబూ. మావన్నీ తాకట్టు బతుకులేగా? మేం కేవలం పదిమందికీ పని కల్పించగల పెద్ద జీతగాళ్ళం. మాకు పరిశ్రమ యజమానులని బిరుదిచ్చి ఊరు పట్టనన్ని రూల్స్ పాటించమంటారు. మా దగ్గర పనివాళ్ళు 8 గంటలు పని చేస్తే, 18 గంటలు పనిచేసే కష్టజీవులం మేం. మా వన్నీ పూర్తి స్వంత బాధ్యతతో, పూర్తి తనఖాలతో నడిచే చిన్న పరిశ్రమలు. మా దగ్గర ఏ షేర్లూ, ఏ ప్రజాధనమూ లేదు. అతి తక్కువ పెట్టుబడితో ఎంతో నిరుద్యోగ సమస్యని తీర్చగల ఏకైక సాధనాలం. వృక్షోరక్షతి రక్షితః అని రాసి తిరుపతిలో చెట్లకి వేలాడదీసినట్లు పరిశ్రమో రక్షతి రక్షితః అని రాసి మీ ఆఫీసుల్లోనూ, బ్యాంకుల్లోనూ పెట్టుకోండి. జలుబు చేసేటట్లుంది ఒక్క కోల్డరిన్ ఇవ్వండి మహానుభావులారా! అని బ్యాంకుకెడితే, ఆ జలుబు కాస్తా ఏ ఫ్లూలోకో, నిమోనియాలోకో దింపి రోగ నిర్ధారణకే చిప్పా, కర్రా చేతికొచ్చి ఆ పేషంటు హరీమన్నాక, ఇంట్లో మిగిలిన వాళ్ళు పదమూడో రోజు  పాయసం వండుకుని తినే టైంకి పావు కోల్డరిన్ శాంక్షన్ చేశాం, వారసులందరూ సంతకాలకి రండి! అనే పరిస్థితినించీ పరిశ్రమని కాపాడండి !"

"ఆఁ! ఆగండాగండి. వెళ్ళిపోకండి. .....  వెళ్ళిపోకండి...."

"లే! లే!  ఎన్ని మాత్రలు మింగావు? నిద్ర పట్టడం లేదనడం, రెండు మూడు  కాంపోజులు మింగడం. ఇది వరకైతే ఎన్.టి.ఆర్. కల్లోకొచ్చాడు, నాగేశ్వర్రావ్ కల్లోకొచ్చాడు - అని కాల్చుకు తినేదానివి. ఇప్పుడేకంగా క్లింటనొచ్చాడా.... మేనకా విస్కీ సమేతంగా?!"

"కాదండీ, ఐనా వాడి తప్పేముంది చెప్పండి. ఆ అమెరికా పీనుగులు భారత భాగవతాలు చదవక వాళ్ళు వాళ్లనలా అల్లరి పెట్టుకుంటున్నారు. గానీ, ఏ మగాడైనా ఏం చేస్తాడంత చక్కని చుక్క వెంటబడితే? ఇంతకీ నాకు కల్లోకి వచ్చింది మన సి.ఎం.గారండీ!"

"ఆయన నిజంగానే ఎవర్నీ నిద్రపోనీయడం లేనట్లుంది!"

"ఏదో రాష్ట్రాన్ని  బాగుచేయాలని తాపత్రయపడుతున్నాడు కదా అని నాకు తోచిన నాలుగు ముక్కలు మాట్లాడుతుంటే, మీరు లేపేశారు. ఎప్పుడూ ఇంతే! నన్నేపనీ సవ్యంగా పూర్తి చేయనీయరు!"

"మంచినీళ్ళు తాగి మరీ పడుకో! నీ దండకం మొదలుపెట్టుంటావు!! ఆయన హడిలి, పారిపోయుంటాడు!"